సాక్షి
ప్రకాశం
మంగళవారం । 3 । జూన్ । 2025



కార్డుదారులకు కష్టాల మూట
జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ తీరుతో కార్డుదారులు నరకం చవిచూస్తున్నారు. వృద్ధులు, వికలాంగుల అవస్థలు వర్ణనాతీతం.
- IIలో..



వివాహ ధ్రువీకరణకు చిక్కుముళ్లు
వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలంటే సాంకేతిక చిక్కుముళ్లు ఎదురవుతున్నాయి. ఒక్కొక్కరికి ఒక్కో రకమైన నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నారు.
- IIలో..

గరిష్టం/కనిష్టం
40/29

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

● కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



మీకోసంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోనని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే ఊరుకోబోనని అధికారులను హెచ్చరించారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ‘మీ కోసం’ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ‘మీ కోసం’ కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని ఆమె చెప్పారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, కుమార్, జాన్సన్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తమ్ముళ్లకు ఉపాధి

ఉపాధి హామీ పథకం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఫలహారంగా మారింది. తమ పార్టీ వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకుని ఇష్టారీతిగా అక్రమాలకు పాల్పడుతున్నారు. స్థానికంగా లేనివారికి జాబ్‌కార్డులు ఏర్పాటు చేసి పనులకు రాకున్నా దొంగ మస్టర్లు వేయడం, ఒకే ఫొటోను అనేక గ్రూపుల్లో అప్‌లోడ్ చేయడం, చేసిన పనులనే మళ్లీ చేసినట్లు చూపడం ఇలా.. అందిన కాడికి దండుకుంటున్నారు. ఇంత అవినీతి జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి
- పనులకు రాకున్నా హాజరు
- ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారికి ప్రతిరోజు హాజరు
- ఒకే ఫొటో అనేక గ్రూప్‌లకు అప్‌లోడ్
- పనులకు వచ్చేది అరకొర.. హాజరు కొండంత
- గతంలో తవ్విన కందకాల పనుల్లోనే నేడు మళ్లీ పనులు
- పనికి రాకుండా హాజరు వేసినందుకు ఎఫ్‌ఏలకు సగం కూలీ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

బేస్తవారిపేట: ఉపాధి హామీ పథకంలో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. అనేక సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్యాయంగా తొలగించారు. అర్థవీడు మండలంలో కనీసం పెండింగ్ జీతాలు కూడా చెల్లించకుండా నేటికీ ఇబ్బందులు పెడుతున్నారు. వారి స్థానంలో అధికార పార్టీ నాయకులు తమకు కార్యకర్తలుగా, నాయకులుగా పనిచేసే వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ఉపాధి హామీ పనులు జరుగుతున్న పశ్చిమ ప్రకాశంలో ఎఫ్‌ఏలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

కొత్త ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు కల్పవృక్షం...

పచ్చ పార్టీ కార్యకర్తలు, నాయకులను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమించిన తర్వాత ఉపాధి హామీ పథకంలో అవినీతికి అంతే లేకుండా పోయింది. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఈ పథకం కల్పవృక్షంగా మారింది. కూలీలు పనులకు రాకున్నా మస్టర్లలో పేర్లు నమోదు చేస్తూ నిధులు కొల్లగొట్టేస్తున్నారు. 50 మంది కూలీలు పనులకు హాజరైనా వందల మంది వచ్చినట్లు చూపుతూ బోగస్ మస్టర్లను సృష్టించి నిధులు మింగేస్తున్నారు.

ఫొటోల మాయాజాలం...

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో పనులకు హాజరైన కూలీల గ్రూప్ ఫొటోలు నమోదు చేయాలి. అయితే ఒకే ఫొటోను పదుల సంఖ్యలో గ్రూప్‌లకు అప్‌లోడ్ చేస్తున్నారు. అన్నీ ఫొటోల్లో కూలీలు ఒక్కరే కొద్దిగా అటు ఇటుగా మార్చుతూ దొంగ మస్టర్లు సృష్టించి భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఇంత అవినీతి జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామాల్లో లేనివారికి జాబ్‌కార్డులు..

గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి స్థానికంగా లేనివారికి జాబ్‌కార్డులు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల్లో స్థిర పడినవారు, చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ దూర ప్రాంతాల్లో జీవనం సాగించేవారికి జాబ్‌కార్డులను కొత్తగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు నమోదు చేయించారు. ఇక్కడ నుంచే వ్యవహారం మొదలెట్టారు. మీరు పనికిరారు..నేను హాజరు వేస్తాను వచ్చినదాంట్లో నీకు సగం, నాకు సగం అంటూ బేరం కుదుర్చుకున్నారు. కొన్ని గ్రామాల్లో మీ కుటుంబ సభ్యులకు దొంగ మస్టర్లు వేస్తున్నాం. రానున్న ఎలక్షన్‌లలో మాకు ఓటేయాలని లోపాయికారి ఒప్పందాలకు తెరతీసినట్లు ప్రచారం జరుగుతోంది. రాజకీయ అండలేని వారినుంచి ఒక్కో జాబ్‌కార్డుకు రూ.2 వేలు వసూళ్లకు తెగబడుతున్నారు.



హైదరాబాద్‌లో వ్యక్తికి హాజరు



ఒకే ఫొటోతో వేసిన మస్టర్

అక్రమాల్లో మచ్చుకు కొన్ని ..

- అర్థవీడు మండలం దొనకొండలో కొండమ్మ ఎస్‌ఆర్ ఈజీఎస్‌లో హార్టీకల్చర్ కింద మొక్కజొన్న పంటలో ఒకలైన్ జామ మొక్కలు నాటి బిల్లులు తీసుకున్నారు. జనవరి నెలలో సీఆర్‌డీఏ విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు అప్రమత్తమై మార్చిలో మొక్కలు నాటించారు.
- ఇదే గ్రామంలో సావిత్రి, వెంకటేశ్వర్లు, బాలతిమ్మయ్య హైదరాబాద్‌లో, ఎస్ రోశయ్య కంభంలోని మద్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. వెంకటమ్మ, రోజమ్మ మార్కాపురంలో ఉంటున్నారు. వీరందరికీ ఉపాధి పనులు చేసినట్లు హాజరు వేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ భార్య దేవి పనికి వెళ్లకపోయినా ప్రతి రోజు పని చేస్తున్నట్లు హాజరు వేస్తున్నారు. జాన్ బేల్దారి పనులకు వెళ్తున్నాడు. అయినా ఇతనికి ప్రతిరోజు హాజరు పడుతోంది. ఇలా దూరప్రాంతాల్లో ఉన్నవారికి హాజరు వేసి ఉపాధిహామీ పథకం లక్ష్యాన్ని నీరుగార్చుతున్నారు.
- ఫారంపాండ్ పని టీ వెంకటేశ్వర్లు పొలంలో చేయాల్సి ఉంది. పొలం పక్కన నంబయ్య కుంటలో గతంలో పని చేసిన ప్రదేశంలోనే పనులు చేయిస్తున్నారు.
- వీరభద్రాపురంలో గతంలో పనిచేసి మీటరు లోతు తీసిన గుంతలోనే ఉపాధిహామీ పని జరుగుతోంది.

రెండు, మూడేళ్లుగా చేసిన పనుల్లోనే..

గతంలో చేసిన పనుల్లోనే ఫీల్డ్ అసిస్టెంట్‌లు మళ్లీ పని చేయిస్తున్నారు. పాత కందకాల పనులను కొత్తగా చేయించినట్లు కుయుక్తులకు తెరలేపారు. కొత్తచోట పనులు చేయిస్తే కొలతలు రావని ఈ కుట్రకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో టీఏలు పని ప్రదేశంలోకి వెళ్లి కొలతలు తీయకుండానే రూ.250- రూ.300 కూలీ పడేలా రికార్డుల్లో నమోదు చేస్తున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

తలలు పట్టుకుంటున్న టీఏలు..

కొన్ని పంచాయతీల్లో టీఏలు అవినీతికి పచ్చ జెండా ఊపితే.. ఎక్కువ శాతం టెక్నికల్ అసిస్టెంట్‌లు భయాందోళన చెందుతున్నారు. మస్టర్ల తనిఖీకి వెళ్తే ఉద్యోగం చేయాలని ఉందా లేదా అని పచ్చచొక్కాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో ఇంత అవినీతి జరుగుతున్నా చూస్తూ ఊరుకోవడం తప్పా చేసేది ఏమీ లేక లోలోన మదనపడుతున్నారు. సోషల్ ఆడిట్‌లో కొలతలు చూపించకపోయినా, పని చేయనివారికి కూలీ వేసినట్లు గుర్తించినా రికవరీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తీవ్ర ఆవేదనలో ఉన్నారు.

యాచవరంలో ఒకే ఫొటోపై

40 మందికి మస్టర్లు

మార్కాపురం: మార్కాపురం ఉపాధి హామీ పథకంలో చిత్ర విచిత్రాలు కొనసాగుతున్నాయి. పది రోజుల క్రితం మండలంలోని బోడపాడులో ఒకే ఫొటోపై 50 మందికి మస్టర్లు వేయగా, మళ్లీ ఇదే మండలంలోని యాచవరం గ్రామంలో ఫీల్డు అసిస్టెంట్ ఒకే ఫొటోపై 40 మందికి మస్టర్లు వేశాడు. కొన్ని గ్రామాల్లో గంట సేపు మాత్రమే ఉండి కూలీలు ఇళ్లకు వస్తున్నా పూర్తిస్థాయిలో వేతనం పడుతోంది. ఇలాంటి చిత్ర విచిత్రాలన్నీ ఉపాధి హామీపథకంలో జరుగుతున్నా అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు తీరు విమర్శలకు తావిస్తోంది. గ్రామ స్థాయిలో కూటమి నాయకుల మద్దతు ఉంటే తమకు భయం.. దిగులు లేదనే ధీమా ఉండటంతో ఇలాంటి పనులు చేసేందుకు ఏమాత్రం ఫీల్డు అసిస్టెంట్లు వెనుకాడటంలేదు. మండలంలోని కొన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను ఉపాధి హామీ పనులకు వద్దని ఫీల్డు అసిస్టెంట్లు తెగేసి చెబుతూ కూటమి నేతల కళ్లల్లో ఆనందం కోసం ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. రోజుకు రూ.230 నుంచి రూ.240 వరకూ ఉపాధి హామీలో పనిచేసే కూలీకి వేతనం వస్తోంది. అయితే ఫీల్డు అసిస్టెంట్ల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల మద్దతుతో అవినీతి తార స్థాయికి చేరుతోంది. పత్రికల్లో వస్తే మాకేంటనే ధీమా కనబడుతుండగా.. అధికారులు కూడా చూసిచూడనట్లు పోతుండటంతో ఫీల్డు అసిస్టెంట్లు తమ ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై మార్కాపురం ఉపాధి హామీ పథకం ఏపీఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



ఒకే ఫొటోతో పలువురి పేర్లపై వేసిన మస్టర్లు

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం

- ఏడాదిలో 400 మంది హత్యకు గురయ్యారు
- 800 మందిపై దాడులు జరిగాయి
- ఎన్ని యాక్టులు పెట్టినా బెదిరేదిలేదు
- తప్పుడు కేసులకు భయపడం
- 4వ తేదీ నిరసనను విజయవంతం చేయండి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి
- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చుండూరు రవిబాబు తదితరులు

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో నిరంకుశ, ప్రజావ్యతిరేక పాలన ఏడాదిగా కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఓట్లు వేయించుకునేందుకు ప్రజలను మభ్యపెట్టేలా ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. అమలు చేయమని అడుగుతున్న వారిపై అధికారాన్ని, అధికారులను అడ్డంపెట్టుకుని దాడులు, బెదిరింపులు, అరెస్టులు చేయిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ సుమారు 400 మంది హత్యకు గురయ్యారని, 800 మందిపై దాడులు జరిగాయని ఆరోపించారు. ఇదంతా చూస్తుంటే ఇంత దుర్మార్గమైన పాలన ఎటువైపు వెళుతోందో ప్రజలు గమనించాలన్నారు. నమ్మించి ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక వంచిస్తోందని, ప్రజలకు వెన్నుపోటు పొడుస్తోందని, ఇందుకు నిరసనగా ఈ నెల 4వ తేదీ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రజలతో కలసి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలసి వంచనకు పాల్పడుతున్న చంద్రబాబుపై పోరాటం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. 4వ తేదీ చేపట్టిన ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఏడాదిగా కూటమి నేతలు చేసిన మోసానికి ప్రజలు ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

తప్పుడు కేసులకు భయపడం:

తప్పుడు కేసులు పెడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను ప్రభుత్వం వేధిస్తోందని, దీనికి భయపడేది లేదన్నారు. ప్రజలు బయటకు వచ్చి ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలుసుకుని ప్రభుత్వం 30 యాక్టు, 144 సెక్షన్లు అంటూ నిబంధనలు పెడుతోందని చెవిరెడ్డి విమర్శించారు. ప్రజల పక్షాన పోరాటం చేసే సమయంలో పుట్టిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని, ఎలాంటి బెదిరింపులకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బెదరరని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశామని విలేకరుల సాక్షిగా చెప్పే ధైర్యం ఈ మంత్రులకు ఉందా అని ఆయన ప్రశ్నించారు. రేషన్ వాహనాలు రద్దు చేయడంతో నేడు ప్రజలు చాలా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికొచ్చే బియ్యాన్ని ఈ రోజు ఎన్నో అవస్థలు పడి తెచ్చుకోవాల్సి వస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పెద్ద ఎత్తున జనం పోరాటాలకు ముందుకు వస్తున్నారన్నారు. ఒక సంవత్సరంలోనే ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందని చెవిరెడ్డి ధ్వజమెత్తారు. తొలుత ఈ నెల 4వ తేదీ నిర్వహించే వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినంగా ప్రకటించిందన్నారు. చంద్రబాబు ఉన్న ఉద్యోగాలు పీకేయడంతో పాటు నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. 20 వేల మంది ఎక్సైజ్ లో పనిచేస్తున్న సిబ్బందిని, 9 వేల మంది రేషన్ వాహనాల డ్రైవర్లు తొలగించి వెన్నుపోటు పొడిచారన్నారు. రైతులను, మహిళలను, అమ్మ ఒడి ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తానని, ఇలా అన్ని వర్గాల వారిని వెన్నుపోటు పొడిచారన్నారు. మా పార్టీ పిలుపు మేరకు జూన్ 4వ తేదీ అంబేడ్కర్ భవన్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబుకు కనువిప్పు కలిగేలా ఈ వెన్నుపోటు దినంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాలడుగు రాజీవ్, దేవా, శ్రీకాంత్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు సాధం విజయలక్ష్మి, అప్సర్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో కరోనా కలకలం

● రెండు కరోనా కేసులు నమోదు

ఒంగోలు సిటీ: జిల్లా కేంద్రమైన ఒంగోలులో రెండు కరోనా కేసులు పాజిటివ్ రావడం కలకలం సృష్టిస్తోంది. నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కొద్ది రోజులుగా జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. అనుమానం వచ్చిన వైద్యులు శుక్రవారం రక్త పరీక్షలు చేశారు. శనివారం ఫలితాలు వచ్చాయి. కరోనా పాజిటివ్ అని వైద్యులు నిర్ధారించారు. అందులో ఒకరికి జీజీహెచ్‌లోనే వైద్యం చేస్తున్నారు. మరొకరిని హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యం చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ ఇద్దరు టీబీ వ్యాధితో బాధపడుతున్నారని, జీజీహెచ్ లో వైద్య చికిత్స పొందుతున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు.

బాలికను దత్తత తీసుకున్న దంపతులు

ఒంగోలు సబర్బన్: బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న 18 ఏళ్ల నిండిన ఓ.శిరీషను (తల్లిదండ్రులు లేని) కనిగిరి చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సమక్షంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ కమిటీ సభ్యులతో కలిసి దత్తత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిరీష 6వ తరగతి నుంచి ఒంగోలులోని బాలసదనంలో ఉంటూ 10వ తరగతి వరకు చదివింది. 10వ తరగతి చినగంజాం కేజీబీవీలో విద్యనభ్యసించిందన్నారు. ఇటీవల వచ్చిన పదో తరగతి (2025) పరీక్ష ఫలితాల్లో 600/549 మార్కులు ఉత్తీర్ణత సాధించిందన్నారు. పోస్టర్ కేర్ కింద కనిగిరి దంపతులకు బాలిక సంరక్షణ నిమిత్తం ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి.మేన సుజన, డీసీపీఓ పి.దినేష్ కుమార్‌తో పాటు డీసీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో సత్తా చాటారు



విద్యార్థులను అభినందిస్తున్న సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు

ఒంగోలు సిటీ: జేఈఈ అడ్వాన్స్ 2025 పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆల్ ఇండియా స్థాయిలో ఒంగోలుకు చెందిన శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థి ఎం.రఘునాథ్ మకని 3వ ర్యాంకు, బేస్తవారిపేట మండలంలోని ఖాజీపురానికి చెందిన మంతు వెంకట రవి చంద్రారెడ్డి ఆల్ ఇండియా 8వ ర్యాంక్ సాధించారు. పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి చెందిన ఉప్పాల మణికంఠ నాయుడు 630వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఒంగోలు శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థి వి.మణికంఠబాబు 119 వ ర్యాంక్, కె.లోకక్రిటి 1343 వ ర్యాంక్ సాధించారని ఆల్ ఇండియా స్థాయిలో శ్రీసరస్వతి విద్యాసంస్థలకు గుర్తింపు తీసుకురావడానికి సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు చైర్మన్ రమణారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ఫలితాల సాధనకు కృషి చేసిన డైరెక్టర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈఓ ఎస్.వి.సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్ష ఫలితాల్లో శ్రీ ప్రతిభ విద్యార్థి కాటూరి హరినాథ్ ఆల్‌ఇండియా స్థాయిలో 994 (ఎస్సీ కేటగిరీలో) ర్యాంకు సాధించినందుకు ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్‌నారాయణ్, అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.
- ఆర్.వి.హాసిని ఆల్ ఇండియా స్థాయిలో 2237వ ర్యాంకు సాధించింది. తండ్రి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి జలవనరుల శాఖలో ఉద్యోగిగా, ఎన్‌జీఓ సంఘ నాయకునిగా ఉన్నారు. తల్లి ఎం.జ్యోతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.
- ఉమామహేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థిని దాసరి యామిని ఆల్ ఇండియా స్థాయిలో 3837 (ఎస్సీ కేటగిరీ) లో సాధించినందుకు డైరెక్టర్స్ సి.మల్లేశ్వరరావు, సి.జయలక్ష్మి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.
- జేఈఈ అడ్వాన్స్‌డ్ లో ఒంగోలు ఎస్.ఆర్ కళాశాల విద్యార్థి దాసరి గగన్‌కుమార్‌కు జాతీయ స్థాయిలో 1857 వ ర్యాంక్ సాధించినందుకు అకడమిక్ డీన్ అరవింద్, జోనల్ ఇన్‌చార్జ్ బి.శ్రీనివాస్, డీన్ శంకరరావు, ప్రిన్సిపాల్ కె.బాలరాజు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.



ఎస్.ఆర్ కళాశాల విద్యార్థి దాసరి గగన్‌కుమార్



ఉప్పాల మణికంఠ నాయుడు 630వ ర్యాంకు

4న డీఎస్సీ ఎస్జీటీ మోడల్ గ్రాండ్ టెస్ట్

ఒంగోలు సిటీ: పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ డీఎస్సీ ఎస్జీటీ మోడల్ గ్రాండ్ టెస్ట్-2025 నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. డీఎస్సీ ఎస్జీటీ రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు పులి శ్రీనివాసరావు (94402 09155), బీ శ్రీనివాసరావు (90101 06426)ను సంప్రదించాలని కోరారు.

స్పౌజ్ వర్కింగ్ ప్లేస్‌లకు ఆప్షన్ పెట్టుకోవాలి

ఒంగోలు సిటీ: టీచర్ల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకునే టీచర్లు వారి స్పౌజ్ స్టేట్ కేడర్, జోన్ కేడర్ మినహా, మిగిలిన క్యాడర్లలో స్పౌజ్ సర్టిఫికెట్ ఉపయోగించుకునే వారు వారి స్పౌజ్ వర్కింగ్ ప్లేస్‌లకు దగ్గర ప్లేస్ నుంచి మాత్రమే ఆప్షన్ పెట్టుకోవాలని డీఈఓ ఏ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆప్షన్ పరిశీలించబడుతుందని చెప్పారు. దీనికి భిన్నంగా వ్యవహరించిన టీచర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

రెండు గృహాల్లో చోరీ

- 2 తులాల బంగారం, రూ.36 వేల నగదు అపహరణ

జరుగుమల్లి(సింగరాయకొండ): తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీకి తెగబడ్డారు. ఈ సంఘటన జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలోని ఎస్టీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కాలనీలోని వల్లెపు అంజమ్మ, వేటగిరి ప్రశాంతి ఇళ్ల తాళాలు పగలగొట్టి సుమారు 2 తులాల బంగారం, రూ.36 వేల నగదు చోరీ చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీ



సంఘటన స్థలంలో ప్రమాదానికి కారణమైన లారీ

పెద్దారవీడు: బత్తాయి లోడ్‌తో వేగంగా వెళ్తున్న లారీ కూల్‌డ్రింక్, జ్యూస్ షాపుల్లోకి దుసుకెళ్లింది. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు బస్టాండ్‌లో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కనిగిరి ప్రాంతం నుంచి బత్తాయి లోడుతో రాజస్థాన్‌కు వెళ్తున్న లారీ దేవరాజుగట్టు జంక్షన్‌లోని హైవే అండర్ పాస్ మూలమలుపు వద్ద అదుపు తప్పింది. తెల్లవారుజామున లారీ డ్రైవర్‌కు రూట్ అర్థం కాక నేరుగా షాపుల ముందున్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి దూసుకెళ్లింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయందోళన చెంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు వేలాడుతుండటంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సరఫరాను నిలుపుదల చేశారు. కూల్‌డ్రింక్ దుకాణం యజమాని మునగపాటి నాగ రామాచారికి రూ.1.50 లక్షలు, జ్యూస్ షాప్ యజమాని సుబానీకి రూ.40 వేల మేర నష్టం వాటిల్లింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పవర్‌లిఫ్టింగ్‌లో యువత రాణించాలి



విజేతలను అభినందిస్తున్న డీఎస్పీ

ఒంగోలు: పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతి ఇనుమడింపజేయాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మినీ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి ముగింపు పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చివరిరోజు నిర్వహించిన జూనియర్ మెన్ బెంచ్ ప్రెస్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు మెమెంటోలు, పతకాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వివిధ విభాగాలలో రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా వారు సాధన చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీలలో సైతం సత్తా చాటి రాష్ట్ర క్రీడా ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి జి.రాజ రాజేశ్వరి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ప్రభాకరరావు, గంటా వెంకటేశ్వర్లు, సౌత్ జోన్ సెక్రటరీ సకల సూర్యనారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యదర్శి జి.భక్తధృవుడు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

కార్డుదారులకు కష్టాల మూట



ఒంగోలు బలరాం కాలనీలో సర్వర్ పనిచేయక కార్డుదారుల అవస్థలు



బియ్యాన్ని భారంగా మోసుకెళ్తున్న మహిళ

- బియ్యం మోసుకెళ్లలేక మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు
- పనులు మానుకుని రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు
- సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రహసనంగా సరుకుల పంపిణీ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ తీరుతో కార్డుదారులు నరకం చవిచూస్తున్నారు. ఇళ్లకు దూరంగా ఉన్న రేషన్ దుకాణాలకు తంటాలు పడుతూ వెళ్లి బియ్యం తీసుకున్నా.. మోసుకెళ్లే క్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పడుతున్న అవస్థలు అన్నీ కావు. దీనికి తోడు సర్వర్ తరచూ మొరాయిస్తుండటంతో గంటల తరబడి నిరీక్షించక తప్పడం లేదు. అంతసేపు క్యూలో



స్కూటీపై బియ్యం బస్తాలతో మహిళ తిప్పలు..

నిల్చోలేక వృద్ధులు, మహిళలు నేలపై కూలబడి తమ వంతు కోసం వేచి చూస్తున్న పరిస్థితి. డీలర్లు బియ్యం ఇంటికి తెచ్చి ఇవ్వరన్న భయం, లేవని తిరస్కరిస్తారన్న ఆందోళనతో వృద్ధులు, దివ్యాంగులు రేషన్ షాపుల వద్దకు క్యూకడుతున్నా వారికి భరోసా ఇచ్చే వారు కరువయ్యారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే బియ్యం తెచ్చిస్తారన్న అధికారుల మాట కేవలం ప్రకటనలకే పరిమితమైంది.

అప్పుడే బాగుంది.. ఇప్పుడిదేంది?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలు రేషన్ సరుకుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించకూడదనే సదుద్దేశంతో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) విధానాన్ని తీసుకొచ్చారు. కార్డుదారుల ఇళ్ల వద్దకే బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంతో సంతోషంగా తీసుకున్నారు. ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న విధానానికి ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం మంగళం పాడుతూ ఎండీయూ వాహనాలను పూర్తిగా రద్దు చేసింది. దీంతో కార్డుదారులు శాపనార్థాలు పెడుతూ బియ్యం మోసుకెళ్తున్నారు. పల్లెల్లో



బియ్యం మూటను మోయలేక వృద్ధురాలి అవస్థ

రేషన్ పంపిణీ తీరు దారుణంగా మారింది. సుమారు 2 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోలేక కార్డుదారులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు.

పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి

- జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఎంపీడీఓలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్డీవోలు, డీఎల్పీఓలు, ఈఓఆర్డీలు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, హౌసింగ్ పురోగతి, ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమంపై, యోగాంధ్ర క్యాంపెయిన్ తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, అందుకనుగుణంగా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 26 శాతం పచ్చదనం ఉండగా, ప్రకాశం జిల్లాలో 36 శాతం ఉందన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి నవంబర్ వరకు జిల్లాలో 35 లక్షల 75 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 4 లక్షల 10 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.




జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ, ఇతర అధికారులు

వీడియో సమావేశంలో డీఎఫ్ఓ సోషల్ ఫారెస్ట్ రాజశేఖర్, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

వివాహ ధ్రువీకరణకు చిక్కుముళ్లు!

- స్పెషల్ మ్యారేజ్ సర్టిఫికెట్ల జారీలో సాంకేతిక సమస్య
- ఆ కేటగిరీ కింద ముస్లింలు, క్రిస్టియన్లు
- వివాహానికి అర్హత వయసు యువతులకు 18, యువకులకు 21 ఏళ్లు
- స్పెషల్ కేటగిరీలో యువతులకు 21 ఉంటేనే దరఖాస్తుకు అవకాశం
- ఈ నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు



స్పెషల్ మ్యారేజ్ సర్టిఫికెట్ దరఖాస్తు సమయంలో భార్య వయసు 21 ఏళ్లు ఉండాలని ఎర్రర్ చూపిస్తున్న దృశ్యం

కంభం: మూడు ముళ్ల బంధానికి ధ్రువీకరణ పత్రం పొందాలంటే సాంకేతిక చిక్కుముళ్లు ఎదురవుతున్నాయి. ఏ కులం వారికైనా వివాహం చేసుకోడానికి అర్హత వయసు వధువుకు 18, వరుడికి 21 ఏళ్లు. కానీ మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకునే సమయంలో మాత్రం ఒక్కొక్కరికి ఒక్కో విధంగా నిబంధనలు పెట్టడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న వారు తమ భార్య వివరాలు రికార్డుల్లో నమోదు చేసుకోవాలంటే మ్యారేజ్ సర్టిఫికేట్ తప్పనిసరి. ఈ సర్టిఫికెట్లను ప్రభుత్వం రెండు కేటగిరీలుగా విభజించింది. అందులో మొదటిది హిందూ మ్యారేజ్ సర్టిఫికెట్, రెండోది స్పెషల్ మ్యారేజ్ సర్టిఫికెట్. హిందూ మ్యారేజ్ సర్టిఫికెట్ పొందేందుకు ఎటువంటి ఇబ్బంది లేదు కానీ స్పెషల్ కేటగిరీ కిందకు వచ్చే ముస్లింలు, క్రిస్టియన్లు వివాహ ధ్రువీకరణ పత్రం పొందలేక అవస్థలు పడుతున్నారు.

దరఖాస్తులోనే తిరకాసు!

హిందూ మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమైన వారు దరఖాస్తు చేసే సమయంలో పెళ్లికూతురి వయసు 18 ఏళ్లు ఉంటే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసేందుకు వీలవుతోంది. అయితే స్పెషల్ మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసే సమయంలో ముస్లింలు, క్రిస్టియన్ వర్గాలకు చెందిన యువతుల వయసు 18 ఏళ్లు నిండినా వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచేందుకు అవకాశం ఉండటం లేదు. పెళ్లి కుమార్తె వయసు కచ్చితంగా 21 ఏళ్లు ఉండాలని వెబ్‌సైట్‌లో స్పష్టం చేయడంతో తలపట్టుకుంటున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే 'తాము ఏమీ చేయలేం, ఆన్‌లైన్‌లో ఉన్న దాని ప్రకారం దరఖాస్తు చేసుకోండి' అని సూచిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

ఉద్యోగులకూ తిప్పలు

ఆర్మీ ఉద్యోగులతోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి. అదే విధంగా ఆధార్, రేషన్ కార్డులో వివరాల నమోదుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమవుతోంది. అయితే స్పెషల్ కేటగిరీ వర్గాలకు చెందిన యువతులకు 21 ఏళ్ల వయసు నిబంధన విధించడంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తిప్పలు పడుతున్నారు. ఇదిలా ఉండగా నిరక్షరాస్యులు వయసు ధ్రువీకరణ తెలియజేసే అవకాశం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీలో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

జిల్లాలో బాల అదాలత్‌లు ఏర్పాటు చేయాలి

- బాలల సమస్యలపై ఆ సమావేశాల్లో చర్చించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సూచించిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో బాల పంచాయతీలు (బాల అదాలత్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. ఈ మేరకు కమిషన్ సభ్యురాలు పద్మావతి..కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను సోమవారం ఆమె ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు కొన్ని సూచనలు చేశారు. జిల్లాలోని బాలబాలికల సమస్యలను కమిషన్ సభ్యురాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పశ్చిమ ప్రకాశంలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఎంఎస్‌కేలు క్షేత్రస్థాయిలో పిల్లలతో మమేకమై పని చేయాలని సూచించారు. స్కూల్స్ జూన్ 12 నుంచి పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఫీజుల జాబితాలను ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలని కలెక్టర్‌కు సూచించారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు కూడా 25 శాతం ఉచితంగా సీట్లు ప్రైవేటు స్కూళ్లలో చోటు కల్పించేలా



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మొక్క అందిస్తున్న బత్తుల పద్మావతి

చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సంబంధించి డీఈఓ కార్యాలయ అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థినులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఆడపిల్లలకు హెచ్‌బీ శాతం ప్రతినెలా చెక్ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఏపీఆర్‌జేసీ అండ్ గురుకులం పాఠశాలల్లో చిన్నారులపై వేధింపులు లేకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారు. ఆయా స్కూళ్లలో కంప్లెయింట్ బాక్స్‌లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి సీసీఐలలో ఉన్న పిల్లల పెండింగ్ కేసులు పూర్తి చేయాలని, తిరుపతిలోని హోంలో ఉన్న పిల్లలకు విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పద్మావతితో పాటు డీసీపీఓ పి.దినేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో సొత్తు రికవరీ

సంతనూతలపాడు: మండల కేంద్రమైన సంతనూతలపాడులోని రజకవాడలో ఓ ఇంట్లో గత నెల 31వ తేదీ రాత్రి చోరీ అయిన సొత్తును పోలీసులు రికవరీ చేశారు. రజకవాడకు చెందిన మోహన్ అనే వ్యక్తి గృహంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి 25 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. 10 గ్రాముల బంగారు బ్రాస్లెట్, నాలుగు గ్రాముల బంగారు ఉంగరం, ఆరు గ్రాముల బంగారు బుట్ట కమ్మలు, నాలుగు గ్రాముల బంగారు కమ్మలు చోరీకి గురైనట్టు బాధితుడు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టిన సంతనూతలపాడు పోలీసులు తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన పాదిలి బ్రహ్మయ్యను నిందితుడిగా గుర్తించారు. సోమవారం మధ్యాహ్నం సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీ అయిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభచాటిన హెడ్ కానిస్టేబుల్ ఉదయ్ కుమార్, కానిస్టేబుళ్లు నారాయణరెడ్డి, నాగార్జునను డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీకాంత్‌బాబు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న సొత్తుతో రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు

ఫిర్యాదులపై సత్వర స్పందన

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- పోలీస్ గ్రీవెన్స్‌కు 79 ఫిర్యాదులు



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పోలీస్ అధికారులను ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎస్పీ అర్జీలు స్వీకరించారు. సమస్యల పూర్వాపరాలు తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని చెప్పారు. కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, జాబ్ మోసాలు, భూ వివాదాలు తదితర సమస్యలపైనే అధికంగా అర్జీలు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణ కుమార్, సీసీఎస్ సీఐ జగదీష్, ఎస్సీ,ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌కు ఎస్సై రాజ్‌కుమార్

కొనకనమిట్ల: కొనకనమిట్ల ఎస్సై రాజ్‌కుమార్ ఒంగోలు వీఆర్‌కు కేటాయిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంకితభావంతో విధి నిర్వహించకపోవడం, స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా లేకపోవడం, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి అందుబాటులో ఉండకపోవడం తదితర ఆరోపణల నేపథ్యంలోనే ఎస్సైని వీఆర్‌కు పంపినట్లు సమాచారం. నూతన ఎస్సైగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

పేదలకు నివేశన స్థలాలివ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలం మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రానికి తహసీల్దార్‌కు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. బడాబాబులు, కార్పొరేట్ సంస్థలకు సంపద దోచిపెట్టే విధంగా పరిపాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు, మహిళకు నెలకు రూ.1500, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇచ్చే పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నేత ఈశ్వరయ్య తదితరులు

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఒంగోలులోని అగ్రహారం దగ్గర ఇచ్చిన పట్టాలకు పొజిషన్ చూపాలని, ఒక సెంటు భూమిని రెండు సెంట్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని ఉంటున్న 42వ డివిజన్ సరళా దేవినగర్, 16వ డివిజన్ దత్తాత్రేయ కాలనీ, కార్మిక నగర్ గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలన్నారు. సీపీఐ నాయకులు ఆర్.వెంకట్రావు, ఆర్.రామకృష్ణ, ఎం.విజయ, శ్రీరాం శ్రీనివాసరావు, ఎంప సలార్, నూనె మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

నాగులుప్పలపాడు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం కావడంతో కట్టుబట్టలతో మిగిలిన బాధిత వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. ఈ సంఘటన సోమవారం ఉదయం నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలులో చోటు చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు.. అమ్మనబ్రోలు ముస్లిం కాలనీకి చెందిన షేక్ కమ్రూన్ అనే వృద్ధురాలి పూరింట్లో విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు స్పందించి మంటలు ఆర్పేలోగా పూరిల్లు మొత్తం కాలిపోయింది. ఈ సంఘటనలో వృద్ధురాలు రెండు రోజుల క్రితం తీసుకున్న పెన్షన్ నగదుతో సహా మొత్తం రూ.50 వేల డబ్బు, దుస్తులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని బాధిత వృద్ధురాలు వేడుకుంటోంది.



మంటల్లో కాలిపోయిన నగదు



ప్రమాదంలో కాలిపోయిన పూరిల్లు